
హరివిల్లు



తమిళ మూలం: ఇందిరా పార్థసారథి • తెలుగుసేత: డా. దేవరాజు మహారాజు

# రాచనిర్ణయం

రాజుగారు తన అధికారు లందర్నీ పిలిచాడు. పిలిచి, తన కొచ్చిన కొత్త ఆలోచనని వారి ముందుంచాడు. ఒక త్రిభుజాకార భవనానికి వెంటనే పథకాలు సిద్ధం చేయమని ఆదేశించాడు. మూడు ముఖాలతో ఉండే ఆ భవనం ఓ వైపు ఆలయం లాగా, మరో వైపు మసీదు లాగా, ఇంకో వైపు చర్చ్ లాగా కనిపించా లన్నాడు. భవనం ఒకటే, ముఖాలు మూడు! మూడు ముఖ్యమైన మతాల సంగమంలా విలసిల్లే 'త్రిపార్శ్వ - మహాద్భుతం'గా శోభిల్లాలని కోరాడు. తరతరాల ప్రజలు తను పరిపాలించిన రోజుల్ని తలచుకోవడానికి ఆ కట్టడం ఒక 'గుర్తు'గా మిగిలిపోవా లన్నాడు.

అధికారు లంతా శ్రద్ధగా విన్నారు.

ఒక అధికారి, గొంతు దగ్గర టై ముడి సరి చేసుకుని ముందు కొచ్చాడు - "మనకు కాగితాలు కావాలండీ" అన్నాడు.

రాజుగారికి మతి పోయింది. "మన మీ కట్టడం కాగితాలతోనా కట్టేది? కాగితా లెందుకు?" అన్నాడు.

ఇంకో అధికారి సన్నగా గొణిగాడు - "కాగితాల మీద ముందు ప్రణాళికలు, పథకాలు... భవనానికి సంబంధించిన ప్లాన్లు సిద్ధం చేసుకుంటాం గదండీ."

మరో అధికారి ఆ విషయాన్ని మరింత పొడిగిస్తూ - "మా అనుభవమంతా కాగితాల మీదే కదండీ - నా కీనాడు ఈ ఉద్యోగంలో ఇరవై యేళ్ల అనుభవ ముందంటే, అది ఇరవై టన్నుల కాగితాలు కదండీ!" అన్నాడు కొంచెం తెలివిగా మాట్లాడబోయి.

"సరేనయ్యా! నా ప్రశ్న అది కాదు. ఈ ప్రాజెక్టుకు ఎంత ఖర్చవుతుందీ అని!" రాజు విసుక్కున్నాడు.

"పది మిలియన్ టన్నుల కాగిత మండీ."

"అరె, ఇటుక, సున్నం ఏదీ అక్కరలేదంటారా యేం?" - రాజు అధికారులను గేలిచేస్తూ అన్నారు.

"కావాలి! కాని కోశాగార మంతా ఖాళీ" - అన్నాడు సంబంధిత అధికారి.

రాజు ఆశ్చర్యపోలేదు. క్షణం ఆలోచించాడు. ఒక సూచన చేశాడు. "సరే, మన రాజ్యంలోని ప్రజల నందరినీ మొదటి రోజు ఇంటి కొక్క రాయి ఇవ్వమందాం. రెండో రోజు రెండు రాళ్లు. మూడో రోజు నాలుగు రాళ్లు. నాలుగో రోజు ఎనిమిది రాళ్లు ఇవ్వమందాం. ఎలా ఉంది ఆలోచన?" అని అందరి ముఖాలు కలయజూశాడు రాజు.

జటిల సమస్యలు ఎదురైనప్పుడు వాటికి సులువైన మార్గాలు సూచించడం రాజుగారికి వెన్నతో పెట్టిన విద్య!

"గొప్ప ఆలోచన! రాజావారు మాత్రమే ఇలా అద్వితీయంగా ఆలోచించగలరు" అని అధికారు లంతా వంది మాగధులై పొగిడారు.

ఆ రోజుకు ఆ సమావేశం ముగిసింది.

కొన్ని నెలల తర్వాత, స్వదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన రాజు అధికారుల్ని పిలవ నంపాడు.

"ప నింకా ప్రారంభం కాలేదు. ప్రజల మధ్య మతం అడ్డు గోడ వలె నిలుస్తూ ఉంది. వారిలో సామరస్యం పెంపొందించడం మన తక్షణ కర్తవ్యం" అన్నాడు.

"ఏలినవారు దయ చూపాలి. ప్రజల నుండి రాళ్ల చందా వసూలు చేస్తున్నాం, ప్రభూ!" అన్నా డొక అధికారి.

"ఈ రోజువరకు ప్రతి ఇంటి నుండి ప్రభుత్వం వారికి 3,62,144 రాళ్లు రావాల్సి ఉంది, మహారాజా!" అన్నాడు ఇంకో అధికారి.

ఆ అధికారి పని గిట్టని ప్రత్యర్థి మరొకడు ముందు కొచ్చి - "ఆ లెక్క ఒక తప్పుల తడక, మహారాజా! ప్రతి ఇంటి నుండి మనకు కేవలం 2,62,144 మాత్రమే అందాల్సి ఉంది" అన్నాడు.

ఇంతలో ఒక గూఢచారి వచ్చాడు. తను

తమిళంలో నవలలు, నాటకాలు విరివిగా రాసిన ఇందిరాపార్థసారథి, ఇటీవలి కాలం వరకు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తమిళం బోధించారు. ఇప్పు డాయన వయసు సుమారు అరవై ఒకటి. 1977లో 'కృతి పునల్'కు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు నందుకున్నారు.

మూలం: కోయిల్.

సేకరించిన అమూల్యమైన రహస్య సమాచారాన్ని రాజుగారికి విన్నవించాడు - "వర్తకులు రాళ్ల ధరను విపరీతంగా పెంచుతున్నారు. ఏలినవారు సత్వరం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది" - అని సారాంశం.

"అయితే, దాని దేముంది? రాళ్ల ధరను మనమే నిర్ణయించి, నిర్ధారిద్దాం! మన పర్మిట్ పొందిన వారినే ఇకపై రాళ్లను అమ్ముకోనిద్దాం!" అన్నాడు రాజు.

జటిల సమస్యలకు సులువైన మార్గాల్ని సూచించడం రాజుగారికి వెన్నతో పెట్టిన విద్య!

"గొప్ప ఆలోచన! రాజుగారు మాత్రమే ఇలా అద్వితీయంగా ఆలోచించగలరు" అంది అధికారుల బృందం ఏక కంఠంతో.

మరి కొన్ని నెలలు గడిచాయి.

కొన్ని అంతర్జాతీయ సమస్యల గూర్చి, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి రాజు విదేశీ పర్యటనలు చేశాడు. ఇతర దేశాలతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకోవడానికి దేశాల మధ్య సద్భావం, సదవగాహన పెంపొందించుకోవడానికి రాజుగారి పర్యటన చాలా చాలా అవసరమైంది. ఆయన విదేశాల నుండి తిరి గొచ్చాడని తెలిసి, అధికారులంత అధికారిక దర్శనానికి వెళ్లారు.

"మా ప్రజలు మాపై తిరుగుబాటుకు సిద్ధ మవుతున్నారని గూఢచారి వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత పదవులపై ఉన్న మీరంత మాకు చేస్తున్న సే వేమిటి?" రాజు మండి పడుతూ అధికారుల్ని నిలదీశాడు.

"నిజమే, ప్రభూ! అందులో మీ గూఢచారుల ప్రతిభ మాత్రం ఏమీ లేదు. ప్రజలు బహిరంగంగానే వీథుల వెంట ఊరేగింపులు తీస్తున్నారు. నినాదా లిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు" అన్నా డొక సీనియర్ అధికారి వినయంగా.

"అయితే విషయ మేమిటి? సమస్య ఎందుకు విషమించింది?" రాజు ఆలోచనలో పడ్డాడు.

"ఆకలే అన్నింటికీ ముఖ్య కారణం మహారాజా!"

"బియ్యం, ఉప్పూ, పప్పూ దొరకడం లేదు. అన్ని దుకాణాలలో లాభసాటి బేరమని అందరూ ఈ మాయదారి రాళ్లే అమ్ముతున్నారు, స్వామీ!"

"వ్యాపారస్తులు ధాన్యమంత విదేశాలకు ఎగుమతి చేసి, రాళ్లు దిగుమతి చేసుకుంటున్నారు, ప్రభో!"

"మీరు తలపెట్టిన ఆ మహా కట్టడం గూర్చి, ఆ మహాత్కార్యం గూర్చి వారి కలా చేయక తప్పడం లేదు, దేవా!" అధికారులంత వారి వారి అభిప్రాయాలు తెలియజేస్తూ వచ్చారు.

రాజు సాలోచనగా అవలోకించాడు. క్షణ మాలోచించాడు - "పూర్వకాలంలో మన యోగులూ, మునులు రాళ్లు తిని బతికేవారు కదా!" అన్నాడు.

ఆ మాటతో అధికారుల మెదళ్లలో ఏదో మెరుపు మెరిసింది. ఒక అధికారి మాత్రం చిన్న పిల్లాడిలా ఎగిరి గంతేశాడు. "అవును ప్రభో! అవును ప్రభో! రాళ్లలో ప్రొటీన్లు, మినరల్సూ, వైటమిన్సు - అబ్బా... అన్నీ ఎంతో సమృద్ధిగా ఉంటాయి సుమండీ!" అని అన్నాడు.

రాజు అర్థవంతంగా తల ఊపాడు. ఊపి - "నా కొక దివ్యమైన ఆలోచన వచ్చింది. రాళ్లు తినడంలో ఉన్న ఉపయోగాలను మనం ప్రజలకు బోధించాలి. వెంటనే ఒక ప్రదర్శన ఏర్పాటు చెయ్యండి. అందులో నేను ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడతాను. రాళ్లలోని పోషకాహార విలువలను గూర్చి తెలియజెప్తాను" అన్నాడు.

"గొప్ప ఆలోచన! రాజావారు మాత్రమే ఇలా అద్వితీయంగా ఆలోచించగలరు" అని అధికారులు వందిమాగధుల నోరు మూయించారు.

ప్రదర్శనలో రాజుగారి ఉపన్యాసం ప్రజల తల కెక్కింది. పొద్దున, మధ్యాహ్నం, రాత్రి... ముప్పొద్దులా రాళ్లు మెక్కుతున్నారు.

కొన్ని నెలల తర్వాత రాజు మళ్లీ తన అధికార బృందానికి దర్శన మిచ్చాడు.



కళ్లు చెదిరేలా ఎందరు బాలకృష్ణులో!

"ప్రజలు సుఖంగా ఉన్నారా?" అని అడిగాడు.

"రాళ్లు తినడం వల్ల, కొన్ని సమస్యలు ఎదురౌతున్నాయి, మహారాజా!" అని నివేదిక సమర్పించాడు సంబంధిత అధికారి.

"ఏ సమస్యా?"

"రాళ్లు తినడం వల్ల, అందరి కడుపులు గట్టిగా అవుతున్నాయి. రాళ్లు ఎవరికీ అరగడం లేదు."

ఒక్క క్షణం ఆలోచించి, రాజు తీర్పు చెప్పాడు - "పెద్ద పొట్ట ఉన్నవాళ్లను మన రాజ్యంలో అందగాళ్ల కింద జమ కడదాం! ఆ మేరకు ఒక ప్రభుత్వ ప్రకటన చేయండి! గణపతిని మన ఆస్థాన దైవంగా నిలుపుకుందాం. అన్నం తినడం, విద్రోహచర్యగా పరిగణిద్దాం. రాళ్లు తినడానికి నిరాకరించిన వారినంత దేశ ద్రోహులుగా పరిగణిద్దాం. వారి వెనక విదేశీ హస్తా లేవో పని చేస్తున్నాయని కూడా ప్రకటిద్దాం. ఏమైనా నా కల ఫలించాలి. నే ననుకున్న భవన నిర్మాణం పూర్తి కావాలి. మందిరం, మసీదు, చర్చ్ - ఎవరికి ఏది కావలిస్తే దానిలాగా అది భ్రమింపజేయాలి. విశ్వ శ్రేయస్సు కోసం నేను కన్న కలలు ఫలించాలి!

"గొప్ప ఆలోచన! రాజావారు మాత్రమే ఇలా అద్వితీయంగా ఆలోచించగలరు" అని అధికారులంత ఆనందించారు. "మీరు చెప్పిన విషయాలు ప్రకటించి, అమలు చేస్తాం, ప్రభూ!" అని సెలవు తీసుకున్నారు.

మరి కొన్ని నెలలు తర్వాత రాజు అధికారుల్ని పిలిపించి మళ్లీ తాజా తాజా తిట్లతో మందలించాడు. "నేను కలలు గన్న మహా కట్టడం ఏమైంది? పని ఎంతదాకా వచ్చింది?" అని గద్దించాడు.

"దేవరవారు, క్షమించాలి! ఆలస్యమైనా, కట్టడం పూర్తయ్యింది. మీరు ప్రారంభోత్సవం చేయడమే తరువాయి" అన్నా డొకడు.

"ఆహా! అయితే సరే. మరింకేం? ఉత్సవం ఏర్పాటు చెయ్యండి! వేడుకలు చెయ్యండి!"

"రాజావారు మళ్లీ క్షమించాలి! ఉత్సవం ఏర్పాటు చెయ్యడానికి వీలుగాకుండా ఉంది."

"ఏం? ఏమైంది?"

"అయ్యా! అన్నీ తెలిసినవారు. మీరు కోపగించుకోగూడదు. రాళ్లు తిని చాలామంది 'సిలికోసిస్' రోగంతో మరణించారు. మిగిలినవారు రాజ్యం వదిలి పారిపోయ్యారు. రాజ్యమే ఖాళీగా ఉంది ప్రభూ!"

"అయితే ఏం? ఇ దో సమస్యా? ఉత్సవానికి విదేశాల నుంచి ప్రజల్ని దిగుమతి చెయ్యండి!"

"గొప్ప ఆలోచన! రాజావారు మాత్రమే ఇలా అద్వితీయంగా ఆలోచించగలరు!" - అధికారుల బృందం బృందగానం మొదలుపెట్టింది.

జటిలమైన సమస్యలకు సులువైన మార్గాల్ని సూచించడం రాజుగారికి వెన్నతో పెట్టిన విద్య!